# ఆకూ, వక్కా

కొలకా బెత్తల్, కొలకా పాక్ పుచ్చుకొని, దాన్లో ఇంతసున్నం వేసుకుని ఉలాసాగా కబుర్లుచెప్పుకోవటం మద్రాసు నగరంలో ఏ కిళ్లీకొట్టుదగ్గరచూసినా కనిపించేదృశ్యమే! ఆకు వక్క వేసుకుని వాళ్లు వెళ్లిపోయినతర్వాతకూడ చిరస్థాయిగా కన్పించే దృశ్యం ఆ ప్రక్క గోడల నిండా సున్నం మరకలు, తంబ ముద్దలు, ఉమ్మిధారలు.

ఆకు వక్క వేసుకోవటం మనదేశపు ఆచారాలలో ఒక విశిష్టస్థానం ఆక్రమించింది. ఇది బహుశా మరే దేశంలో నూ లేదేమోగూడా! మొగలాయి చక్రవర్తుల కాలంలో ఇది ధనికుల అలవాటు. ఆరోజుల్లో ఇది ఒక గొప్పగా పరిగణింపబడేది. కాని ఈనాడు ఇది సామాన్య కుటుంబీకుని జీవితావసరంగా పరిణమించింది. అసలు తాంబూలం లేందే ఈ దేశంలో దేవుడుకూడా తృప్తిపడడు.

కలో గంజో త్రాగి ఆకు, చెక్కముక్క వేసుకుంటేనేగాని ఆ పూట భోజనం 'నిండు'గా వుండదు. మనిషి అలవాట్లను బట్టి, ప్రాంతీ ఆచారాన్ని బట్టి దీని మోతాదు, సేవించే సమయాలు మారుతూ వుంటాయి.

పల్లెటూరిదిక్కువ రైతు పొలంలో పనిచేసి వచ్చి, స్నానంచేసి, సుష్టుగా భోంచేసి వీధి అరుగుమీద కూర్చుంటాడు. రెండు ఆకులు, వక్క నోట్లో వేసుకుని తన పాటి పొలంలో స్వయంగా పండించిన పొగాకును పాయిలుతీసి, చుట్టచుట్టుకుని నోట్లో పెట్టుకొని వెలిగించుకుని తృప్తిపడతాడు. అతనికి ఆ సమయంలోవుండే ఆనందం, తృప్తి మరెప్పుడూ వుండదనే చెప్పాలి. అతనికి తాంబూలంతో అప్పుడే పని. మరి ఆరోజుకు పనిలేదు.

రాయలసీమలో ఆకు వక్క ప్రాధాన్యం చాల ఎక్కువ. ఇది మర్యాదసూచకం. సర్కారుజిల్లాలలో ఇంటికివచ్చిన అతిథికి కాళ్లు కడుక్కోటానికి నీళ్ళిచ్చి, దాహం ఇవ్వటం ఆచారం. కాని రాయలసీమ గ్రామాల్లో అతిథిని సత్కరించటం అంటే ముందుగా ఆకు వక్క యివ్వటం; ఆ తర్వాతనే మిగతా మర్యాదలు.

ఎనిమిదేళ్ల క్రితం కర్నూలు జిల్లాలో ఉద్యోగం చేస్తున్న మా అన్న దగ్గరికి వెళ్లుతున్నా. మార్కాపురంలో ఉదయం రైలు దిగాను. అక్కడినుంచి ఆ గ్రామం 25 మైళ్లుంటుంది. ఉన్న బస్సు ఒక్కటే సాయంత్రం 6 గంటలకు బయలుదేరుతుంది. ఆ మారుమూల కుగ్రామంలో ఉద్యోగం చేస్తున్న వాళ్లంటే అదో మర్యాద గౌరవం! వాళ్ల తరఫువాళ్లన్నా ఆదరం! పగలల్లా ఎలాగో గడిపి సాయంకాలం బస్సులో ఎక్కాను. నావాలకం చూస్తే ఆ ప్రాంతపు వాడినికానని ఇట్టే గుర్తుపట్టొచ్చు. బస్సులో నా ప్రక్కనే కూర్చొన్న ఒకా

**జి. సత్యారావు**

యన ప్రశ్నించాడు ఎక్కడికి పోతున్నారని! అక్కడెవరున్నారని! సంగతి చెప్పాను. "ఓ, మా చిన్న గుమాస్తాగారి తమ్ముడివా!" ఎక్కడలేని ఆప్యాయత. గోడ్లోనుండి ఒక డబ్బా తీశాడు. అందులో అన్నీ అరలే! ఆకులు వక్కలు సున్నం వేరు వేరు అరలలో వున్నయ్యి. ఒక ఆకు తీశాడు దాన్ని సగానికి తుంచాడు. "ఇంత" సున్నంతీసి దానికి రాశాడు. ఇంత పొగాకుకాడ తుంచాడు. పెద్దవక్క నుడ క్రిందపెట్టి కొరికి ఒక చెక్క యిచ్చి వేసుకోమన్నాడు. నాకు పెద్ద చిరాకేసింది. నాకు అలవాటులేదన్నాను. నవ్వుకున్నాడు. అది ఆ ప్రాంత మర్యాదని ఆయన చెప్పాడు.

నిద్రలేచి—లేస్తూనే సిగరెట్టు ముట్టించడం ఈ రోజుల్లో ఒక అలవాటు. ఈ అలవాటు అన్నిచోట్లా తయారవుతున్నది. కాని రాయలసీమ గ్రామాలలో దీనికిముందుగా ఆకు వక్క వేసుకోవాల్సిందే! గట్టిగా చూస్తే పొద్దికాలమూ తప్ప రోజల్లా నోట్లో ఆకు వుండాల్సిందే! అప్పుడప్పుడు పళ్లసందుగా ఆ వుమ్మిని నాజాపగా, సుతారంగా, వుమ్మివేయడం జరుగుతుంటుంది.

ఇక తమిళనాడులో వెత్తిల్ పాక్ మానవ శరీరంలో ఒకభాగంగా తయారయిందనే చెప్పాలి. రోజుకు రూపాయి తెచ్చుకునే కూలివాని దగ్గరనుంచి వేలరూపాయలు జీతం తీసుకునే ఆఫీసరు వరకు ఇది సహజగుణంగా తయారయింది. కూలివారి బొడ్లో వుంటుంది ఆఫీసరు బల్లలో వుంటుంది. అంతే కాదా!, యుద్ధాలలో సైనికులు ఆహారపు పొట్లాలు వెంట తీసుకు వెళ్తున్నట్లు రోజంతటికీ సరిపడ్డ ఆకులు సామగ్రి వెంట వుంటూనే వుంటుంది.

ఈ ఆచారం వలన ఆమధ్య మద్రాసు సచివాలయంలోను, శాసనసభా ప్రాంగణంలోను "న్యూసెన్సు" జాస్తీ అయిందని, ఇది నిర్మూలించుటకు కట్టుదిట్టాలు చెయ్యాలని తలపెట్టారు. తెల్లగా సున్నంకొట్టిన గోడలపై ఎవరో ఒక ప్రబుద్ధుడు వెత్తిల్ పాక్ వుమ్మివేశాడుట. ఎవరో ఏమిటి దాదాపు ఇది ఒక అలవాటు! చెయ్యాలని ప్రత్యేకంగా ఉద్దేశ్యం కాకపోయినా అదిమాత్రం జరిగిపోతుంటుంది.

ఒక మహాపాపి దారినిపోతూ ఒక శివాలయం దగ్గర కూచుని సేద తీర్చుకునే సమయంలో తాంబూలం వేసుకుని చేతికిఅయిన సున్నాన్ని గోడకు రాసి వెళ్లాడుట. చచ్చిన తర్వాత అతనికి మోక్షం లభించిందంట! కారణం శివాలయానికి వెల్లవేశాడుట! అలా అయితే మద్రాసులో గోడలనిండా సున్నం రాచేవాళ్ల విషయం ఏమవుతుంది! 'పట్టణ సౌందర్యం పాడుచేస్తున్నార' నే నేరస్తులేగా వీళ్లందరు!

తాంబూలం సేవించడంలోకూడ కొన్ని సున్నితాలూ వున్నయ్యి. ఇవి మనుషుల అలవాట్లనుబట్టి ప్రాంతీయ ఆచారాల్ని బట్టి మారుతుంటయ్యి. అసలు తాంబూలం సేవించడం ధోరణి చూసి ఆయా మనుషుల గుణగణాలను కొంతవరకు ఊహించవచ్చునేమో!

మద్రాసులో మామూలు బీడాలు రెండు రకాలు. అరణా - ఒకణా అందులో వేసే రంగు సుందదార మొత్తాన్ని బట్టి ఆకుల సంఖ్యను బట్టి ఈధర మారుతూ వుంటుంది. తాంబూల సేవనంలో ఇక మూడో పద్ధతి, 'వెత్తిల్-సీవల్' (పచ్చివక్క సన్నగా తరిగినది) ఇది బీడాగా దొరకదు.

ఇక తెలుగు దేశంలో కిళ్లీ ధర అణా నుంచి రూపాయి వరకు వుంది. సేవించే వ్యక్తి తాహతును బట్టి, అందులో వేసే

(58-వ పేజీ చూడండి)

# భారతదేశంలో అణుశక్తి ఉత్పాదన

అనేక ముఖ్యపరిశ్రమలలో వెనుకబడి ఉన్న భారతదేశం అణుయంత్ర నిర్మాణానికి పోలెడు ఇబ్బందులు ఎదుర్కొని, ఉన్న సాంకేతిక సంపద మీదనే ఆధారపడి పని సాగించవలసి వచ్చింది. అయినప్పటికీ మిగతా ఆసియా దేశాలన్నిటి కంటె ముందుగాను, త్వరితంగాను యంత్రాన్ని సమకూర్చుకో గలిగినదంటే మన శాస్త్రజ్ఞుల ఉత్సాహమూ, నిర్విరామకృషి అందుకు కారణం. ఇది గుర్తించి భారత ప్రధాని హర్షాతిశయం వెల్లడించారు.

యంత్రం నిర్మించాలని గత సంవత్సరం మార్చిలో అణుశక్తి సంఘం నిర్ణయించింది. యంత్ర స్వరూపాన్ని గత సంవత్సరం జూలైనాటికి నిర్ణయించారు. అప్పటినుంచీ సుమారు యాభైమంది శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు కలిసి యంత్రం నిర్మించారు. దీన్ని ప్రయోగాత్మక ప్రయోజనాలకు వినియోగిస్తారు. 25 నుండి 30 లక్షల రూ॥ వరకూ వ్యయం అయ్యే ఈయంత్రం రేడియో ఐసోటోపులు తయారు చేస్తుంది. ఇటువంటి యంత్రాలు వచ్చే పదేళ్ళలో ఇంకా అనేకం తయారై దేశమంతటా అణుశక్తి కేంద్రాలు ఏర్పడి విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసాయి. లక్ష కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగల కేంద్రం నిర్మించడానికి రూ. 20 కోట్లు అవుతుంది.

ఇప్పుడు నిర్మించిన అణుయంత్రాన్ని టెక్నికల్ నిపుణులను తర్ఫీదు చేయడానికి మాత్రమే ఉపయోగిస్తారు. ఈ నిపుణులు తర్ఫీదు అయ్యాక వారి సాయంతో ఇంకా పెద్దయంత్రాలు నిర్మిస్తారు. ★

# ఆకూ, వక్కా

(42-వ పేజీ తరువాయి)

సుగంధ ద్రవ్యాలను బట్టి మారుతుంటుంది. కస్తూరి, వెండిరేకులు గిరాకినిబట్టి వేస్తుంటారు. కిళ్లీ కట్టడంలో అక్కడ పోటీ చాల ఎక్కువ 'ఛాలెంజి కిళ్లీలు' తయారయినయ్యి అక్కడ.

మద్రాసుబీడాలో గటిపదారంఎక్కడా కన్పించదు. వాళ్ల పళ్ళ గట్టిదనానికి ఇది ఒక సూచిక అనవచ్చునేమో!

తమలపాకులు వేయడంలోనే ఒక సొగసువుంది. మదరాసులో 'కవటాకులు' దొరకటం కష్టం. అవి లేకపోయినా వాళ్ళు పట్టించుకోరు. వాళ్ళకు కావాల్సింది 'వెత్తిల్ పాక్' మాత్రమే. సున్నితాలతో పనిలేదు. మరి తెలుగుదేశంలో నవనవలాడుతున్న చక్కటి కవటాకులేందే ఆకు ముట్టరు. ఊపిరాడకుండా ఆకులను బంధించి అప్పుడప్పుడు తినటం తెలుగువారికి అలవాటు లేదు. కానీ ఖర్చుఅయినా తాజాసరుకు కావాల్సిందే! అదే అరవవారికీ తెలుగువారికీ వున్న తేడా! వారిలో పొదుపుతనం వుంది.

చిలకలు చుట్టటం, ఈనెలు తీయటం తమిళులకు తెలియదనే చెప్పాలి. తమలపాకులు తింటంలో వారికి తెలిసిన సున్నితం తొడిమ తుంచటంమాత్రమే! ఆకుచివర తుంచడం కూడ బహు కొద్దిమంది మాత్రమే!

తీరికగా ఈనెలుతీసి, సున్నంరాచి, చిలకలు చుట్టుకుంటూ తాంబూలం సేవించడం తెలుగువాడికే చెల్లు.

మసాలా, జర్దాకిళ్లీలు వ్యక్తులకు కావలసిన 'నిషా' ను బట్టి మోతదు మారుతూ వుంటుంది. రోడ్డు ప్రక్కన వాళ్ళు వదిలే రంగు ఉమ్మి అసహ్యంగా వుంటుంది. బుగ్గన ఇంత తమ్మ ఉంచుకున్న వాళ్ళను చూసే సామాన్యులకు కొంత చిరాకుగా వుంటుంది.

రోడ్డుమీద తమ తమ పనులలో నిమగ్నమై నడుస్తుండే జనాన్ని గమనించకుండా ఏబస్సులో పోతుండే 'జర్దాసేవకుడో' గుప్పుక్కుమని ఉమ్మేస్తాడు. ఆయన మీద ఉమ్మేసయ్యాలనిగాదు కాని తన దేహబాధ తీర్చుకోవాలని. ప్రయోజనం ఏమిటి, ఆయన తెల్లని గుడ్డలపై చిరస్థాయిగా మరకలు పడినై. అవి ఒక పట్టాన పోవు.

ఈ జర్దాకిళ్లీలు వేసేవారికి వాలకం కొంత నవ్వు కలిగిస్తుంది బుగనిండా జరదాతంబ, నోటనిండా జరదాఉమ్మి వుండి మాట్లాడుతుండేవారు నిజంగా ప్రమాదం. అది సమయానికి వుమ్మివేయటానికి వీలులేక మాటాడవలసిన అవసరం వచ్చినప్పుడు తల పైకెత్తి ఏదో మాట్లాడుదామని ప్రయత్నిస్తారు. కాని నోట్లోనుంచి మాటలకంటె ముందు ఉమ్మి బయటకు వచ్చి ఎదురుగా వున్న వాని ముఖంమీద పడుతుంది వాన తుంపరల మాదిరిగా!

అలాంటి వాళ్లను ఒక కంట కనిపెట్టి వుండటం అవసరం! ఆత్మ సంరక్షణార్థం. ★



ఎక్సెలా బ్యాటరీస్ లిమిటెడ్ డైరెక్టరు శ్రీ మనీలాల్ గిరిధర్ లాల్, ఆయన సతి శ్రీమతి విద్యాగౌరి, జనరల్ మేనేజరు శ్రీ హెచ్. ఎన్. దోషి ఇటీవల బ్రిటన్, యూరప్, అమెరికాలలో వ్యాపార నిమిత్తం పర్యటించి బొంబాయి తిరిగి వచ్చారు.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.